క్లుప్తంగా

గరుడ వాహనంపై పాండురంగడు కనువిందు



కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గరుడవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, సుదర్శనాచార్యులు పంచామృతాభిషేకం, మహాగణపతి పూజ, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, సంప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి పాండురంగడు ప్రత్యేక అలంకరణంలో గరుడవాహనంపై భక్తులకు కనువిందు చేశారు. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. గరుడసేవను పురస్కరించుని ఆలయ ఆవరణలో ఒంగోలు కళాకారులచే నిర్వహించిన ఆర్కెస్ట్రా అలరించింది. సోమవారం గజేంద్రవాహనంతో స్వామివారి వాహన సేవలు ముగియనున్నట్లు ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ. 40 లక్షల మంజూరు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో వెలసిన పురాతన బ్రహ్మసూత్ర సహిత నాగ లింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో రూ. 40 లక్షలు మంజూరైనట్లు ఆలయ ధర్మకర్త చిన్ని శేషఫణి, గౌరవ సభ్యుడు చిన్న ఎల్లరామయ్య తెలిపారు. త్వరలో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని ఎండోమెంట్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొల్లవరం రామిరెడ్డి(65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, చలపతి రెడ్డి, వెంకి రెడ్డి తదితరులు రామిరెడ్డి మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సంప్రదాయాలకు చిహ్నాలు దేవాలయాలు

బేతంచెర్ల: మన సంస్కృతికి, సంప్రదాయాలకు దేవాలయాలు చిహ్నాలని సమరసత సేవా ఫౌండేషన్ నంద్యాల జిల్లా సహ కన్వీనర్ నాగ మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పూదోట ఆశ్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ 14వ విడత ధర్మ ప్రచారం కరపత్రాలను పట్టణ ప్రముఖులు హుసేన్‌రెడ్డి, గుండా గోపాలు, ఈశ్వర్ ప్రసాద్, దామోదరయ్య ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సమరసత సేవా ఫౌండేషన్ 2015 నుంచి నేటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక చైతన్యం కోసం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో హిందూ సోదరులు డాక్టర్ నరసింహులు, రామ సుబ్బయ్య, రామకృష్ణ, రామూర్తి, గంగయ్య, గుప్త పాల్గొన్నారు.

చిన్నమల్కాపురంలో క్రికెట్ పోటీలు

డోన్ టౌన్: మండల పరిధిలోని చిన్నమల్కాపురం గ్రామంలో ఆదివారం హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

ముగిసిన కనుమ తిమ్మరాయుని కల్యాణోత్సవం

డోన్ టౌన్ :మండల పరిధిలోని కన్నపుంట గ్రామ సమీప కొండల్లో వెలసిన శ్రీకనుమ తిమ్మరాయుడు కల్యాణోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: మండలంలోని ప్రైవేటు పాఠశాలలో పేద విద్యార్థులకు ప్రభుత్వం కేటాయించిన 25 శాతం ఉచిత సీట్లకు ఈనెల 15 వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సూచించారు.

‘పది’ ఫలితాల్లో సర్కారు బడుల సత్తా

- ఉర్దూ ఉన్నత పాఠశాలలో వందశాతం ఫలితాలు
- గురుకుల పాఠశాలలో 88.5 శాతం ఫలితాలు
- ప్రభుత్వ స్కూళ్లలో 500కు పైగా మార్కులు సాధించిన ఆణిముత్యాలు





హర్షిత(587), శివమహిజ(570), సుప్రియ(566), బాల గౌతమి(562), షాహినా(559), అపర్ణ(557), సుధీర్(521), చందన(546), ప్రవల్లిక(545)

కోవెలకుంట్ల: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో కోవెలకుంట్ల మండలంలోని సర్కారు బడుల విద్యార్థులు సత్తాచాటారు. పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించారు. పట్టణ శివారులోని గురుకుల పాఠశాలలో 88.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. కోవెలకుంట్లకు చెందిన జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన జి. హర్షిత 600 మార్కులకు 587 మార్కులు సాధించింది.

500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు

పది ఫలితాల్లో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 500లకు పైగా మార్కులు సాధించారు. పట్టణ శివారులోని గురుకుల పాఠశాలలో 69 మంది విద్యార్థినీలు వివిధ శ్రేణుల్లో పాస్‌కాగా 17 మంది 500లకు పైగా మార్కులు సాధించడం విశేషం. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు పొందటంతో విద్యార్థులను పలువురు అభినందిస్తున్నారు. స్థానిక జిల్లా పరిషత్‌బాలికోన్నత పాఠశాలకు చెందిన శివమహిజ 570, గురుకుల పాఠశాలలో బాలగౌతమి 562, అపర్ణ 557, అమృత 547 అనుష, శ్వేతాబాయి 546, లక్ష్మిప్రియ 541, జయలక్ష్మి 540, అశ్విని 532, సంజనకు 528 మార్కులు వచ్చినట్లు ప్రిన్సిపాల్ ఫిర్దౌస్ అంజుమ్ తెలిపారు. మండలంలోని భీమునిపాడు జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల విద్యార్థిని సుప్రియ 566, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షాహినా 559 మార్కులు, రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సుధీర్ 521, ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆసియా 510 మార్కులు పొందారు. అలాగే సంజామల మండలం కానాల, కమలపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో షేక్ హాజీరా 554 మార్కులు, చందనకు 546 మార్కులు సాధించారు. పేరుసోముల, నొస్సం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మల్లికాదేవి 562, వెంకట సుధీర్ 564 మార్కులు పొందారు. మండల కేంద్రం సంజామల కస్తూరిభాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రవల్లిక 545, సాహతి 537 మార్కులు కైవసం చేసుకున్నారు.



వందశాతం ఫలితాలు సాధించిన కోవెలకుంట్ల ఉర్దూ ఉన్నత పాఠశాల

పది ఫలితాల్లో మోడల్ స్కూల్ ఆదర్శం

డోన్ టౌన్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో డోన్ మోడల్ స్కూల్ విద్యార్థులు అధిక మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచారు. మొత్తం 99 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 77మంది ఉత్తీర్ణులయ్యారు. వినయ్‌కుమార్ అనే విద్యార్థి అత్యధికంగా 574మార్కులు సాధించాడు. అదేవిధంగా 12 మంది విద్యార్థులకు 500 మార్కులు పైబడి వచ్చాయని ప్రిన్స్‌పాల్ జాస్మిన్ తెలిపారు. రాము 573 మార్కులు, సాయిహర్షిత 569, సాయికార్తీక్‌రెడ్డి 569, వాణి 568, చంద్రభాను 567, ప్రభాష్ 552, తరుణ్ 541, శైలజ 540, హర్షవర్ధన్ 539, మణిశ్రీ 529, ప్రతిభ 500మార్కులు సాధించారు. అలాగే జెడ్పీ హైస్కూల్ అఖిల 554, పాతపేట జెడ్పీ హైస్కూల్ సాయి కౌశిక్ 547, యు.కొత్తపల్లె హైస్కూల్ యుగంధర్ 545, ఎద్దుపెంట హైస్కూల్లో ప్రవీణ్ 537, చిన్నమల్కాపురం హైస్కూల్లో రక్షిత 531, కస్తూర్బా విద్యార్థిని మమత 524, కొత్తపేట జెడ్పీ హైస్కూల్లో హరిత 515, కొచ్చెర్వులో మౌనిక 507, మల్లెంపల్లెలో రాజ్యలక్ష్మి475, నెహ్రూనగర్ హైస్కూల్లో విద్యార్థి లాలుకుమార్ 422 మార్కులు సాధించారు.

అవుకు విద్యార్థుల ప్రతిభ



భూమా సాయి సంతోష్(583), కాసుల గౌతమి (573), సాయితేజేశ్వర్ నాయక్(567)

అవుకు: పది పరీక్షల ఫలితాల్లో అవుకు మండల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థి షేక్ మహమ్మద్ సమీర్ 590 మార్కులు సాధించారు. అలాగే అవుకు బాలుర పాఠశాల విద్యార్థి భూమా సాయిసంతోష్ 583, అవుకు బాలికల పాఠశాల విద్యార్థిని కాసుల గౌతమి 573 మార్కులు, అవుకు బాలుర పాఠశాల విద్యార్థి మహీధర్ కుమార్ 573 మార్కులు, ఆదర్శ పాఠశాలకు చెందిన సుగాలి సాయితేజేశ్వర్ నాయక్ 567 మార్కులు, వై.రంగారెడ్డి 556 మార్కులు, కస్తూర్బా విద్యార్థిని కీర్తన 553 మార్కులు సాధించారు. అదేవిధంగా ఆదర్శ పాఠశాలలో 11 మందికి 500 పైగా మార్కులను సాధించి 70.93శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మంచి మార్కులు సాధించిన విద్యార్థులను, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను స్థానిక చల్లా కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మరింత ఎక్కువగా ఉత్తీర్ణత శాతం పెరిగటానికి కృషి చేయాలని ఉపాధ్యాయులకు చల్లా సూచించారు.



అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సన్మానించిన చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లో 44 శాతం ఉత్తీర్ణత



ఎస్ షాహీన్ (559), ఎస్ ముషిరా (566), లక్ష్మీ నిహారిక (566), మీరాభాయి (542)

బనగానపల్లెరూరల్: పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు 44 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ స్వరూప తెలిపారు. 12 ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూరిబా, ఏపీ మోడల్ స్కూల్, మహాత్మా జ్యోతిరావు పూల్లే పాఠశాలల్లో మొత్తం 970 మంది విద్యార్థిని విద్యార్థులు పది పరీక్షలకు హాజరయ్యారు. ఏపీ మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థి లక్ష్మీ నిహారిక, జెడ్పీబాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్ ముషిరాలు 566 అత్యధిక మార్కులు సాధించారు. అలాగే ఏపీ మోడల్‌కు చెందిన విద్యార్థిని మీరాభాయి 542, నందివర్గం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆయేషా 527, ఇల్లూరుకొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సుప్రీయ 520, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వెంకటలహరి 555, పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్ షాహీన్ 559 మార్కులు సాధించారని ఎంఈఓ తెలిపారు.



హేమమహేంద్ర (541)

కొలిమిగుండ్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి హేమ మహేంద్ర 541 మార్కులు సాధించాడు. మోడల్ స్కూల్‌లో 70 శాతం ఉత్తీర్ణత సాధించారు. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలకు చెందిన ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని మౌనిక 532 మార్కులు సాధించింది. కస్తూర్బా విద్యార్థిని మనోజ్ఞాబాయికి 528 మార్కులు, తిమ్మనాయినపేట ఉన్నత పాఠశాల నుంచి దువ్వూరి మౌనికకు 523 మార్కులు వచ్చాయి. అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థి 509 మార్కులు, పెట్నికోట ఉన్నత పాఠశాలకు చెందిన నారాయణచారి 508 మార్కులు సాధించారు.

మోడల్ స్కూలు విద్యార్థుల ప్రతిభ

బేతంచెర్ల : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 59.18 శాతం సాధించి ఏపీ మోడల్ స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటారు. 600 మార్కులకుగాను 569 మార్కులు సాధించిన సాయి చరితను ప్రిన్సిపాల్ షమీల, అధ్యాపకులు అభినందించారు. పట్టణంలోని మెయిన్ జెడ్పీ హైస్కూలు విద్యార్థి పూజిత రెడ్డి 568, మైత్రి 566 మార్కులు సాధించగా హెచ్‌ఎం హరి కృష్ణ అభినందనలు తెలిపారు. మోడల్ స్కూలు విద్యార్థి శివ మణీశ 553 మార్కులు, దామోదర సాయి 536, పృథ్వీనాథ్ 523, సయ్యద్ షఫిఉన్ 521, తొనిష్ 517, శ్రావణి 507, లక్ష్మిపూజిత 506, మధు మోహన్ నాయుడు 505, వెంకట శ్రీవేణి 503, సాయివాణి, వైష్ణవి 502 మార్కులు సాధించారు. కస్తూర్బా విద్యార్థిని లిఖిత బాయి 547 మార్కులు, పట్టణంలోని హనుమాన్ నగర్ జెడ్పీ హైస్కూలు విద్యార్థి జగదీశ్వర్‌రెడ్డి 536, ఆర్ కొత్తపల్లె జెడ్పీ హైస్కూలు విద్యార్థి లావణ్య 532 మార్కులు సాధించారు.



సాయి చరిత (569)



శివ మణీశ (553)



లిఖిత బాయి (547)



జగదీశ్వర్‌రెడ్డి (536)



దామోదర్ సాయి(536)



పృథ్వీనాథ్ (523)



పూజిత రెడ్డి(568), మైత్రి(566)కి స్వీట్ తినిపిస్తున్న హెచ్‌ఎం

అ‘పూర్వ’ సమ్మేళనం



వేదికపై చేరిన 1989-92 విద్యాసంవత్సర పూర్వ విద్యార్థులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల: స్థానిక కృష్ణతేజ ఫంక్షన్ హాలులో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. కోవెలకుంట్ల పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1989-92 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసుకున్న 60 మంది పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై చేరారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలవడంతో పండగ వాతావరణం సంతరించుకుంది. చదువుకున్న రోజుల్లో జరిగిన సంఘటనలు, జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మల్లు హరినాథరెడ్డి, భక్తవత్సలరెడ్డి, దశరథరామిరెడ్డి, సుబ్బారెడ్డి, భూపతిరెడ్డి, రామేశ్వరరెడ్డి, శ్రీలత, సంగీత, ఉషారాణి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థులు సమ్మేళనం జరిగింది. 2008-09 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒక వేదికపై చేరారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులు జీవీ సుబ్బారెడ్డి, బాలతిమ్మారెడ్డి, రమణయ్య, రమణ, రాజశేఖర్, అమీర్ బాషాను ఘనంగా సత్కరించి గురుభక్తి చాటారు.

నేలమఠాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: స్థానిక నంద్యాల రోడ్డులో ఉన్న శ్రీవీర బ్రహేంద్రస్వామి నేలమఠం ఆలయాన్ని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఎమ్మెల్యే కాటసానికి ఆలయ సంప్రదాయం మేరకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వీరబ్రహేంద్రస్వామికి పూజలు చేసి స్వామి వారి తీర్థప్రసాదం స్వీకరించారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న శ్రీకాశీరెడ్డినాయన నిత్యాదాన్న సంస్థ వద్దకు వెళ్లి అక్కడ జరుగుతున్న సేవా కార్యక్రమాలపై నిర్వాహకులు సాంబ శివారెడ్డిని, భక్తులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

డోన్ నుంచి తాడిపత్రికి ఆర్టీసీ బస్సు సౌకర్యం

డోన్ టౌన్: అనంతపురం జిల్లా తాడిపత్రికి యాడికి గ్రామం మీదుగా సోమవారం నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ శశిభూషణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రజల కోరిక మేరకు తాడిపత్రికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. డోన్‌లో ఉదయం 6.30గంటలకు బయలు దేరి తాడిపత్రికి 9గంటలకు చేరుకుంటుందని, అక్కడి నుంచి 9.15గంటలకు బయలుదేరి డోన్‌కు వస్తుందన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 12గంటలకు ఇదే బస్సు యాడికి గ్రామానికి బయలుదేరి 2గంటలకు చేరుకుంటుందన్నారు. యాడికి నుంచి డోన్‌కు సాయంత్రం 4గంటలకు చేరుకుంటుందన్నారు. మరలా డోన్ నుంచి యాడికి బయలుదేరి 6గంటలకు చేరుకుంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



గుండం ఈశ్వరరెడ్డి(ఫైల్)

సంజామల(కోవెలకుంట్ల): మండల కేంద్రం సంజామలకు చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్యప్రకాష్‌రెడ్డి తండ్రి గుండం ఈశ్వరరెడ్డి(66) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి గ్రామంలో క్రియాశీల రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. ఆయన మృతిపట్ల జెడ్పీ మాజీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ పోచా రమాదేవి, పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి పోచా శీలారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సానుభూతి వ్యక్తం చేశారు.

గుండం కుటుంబానికి పరామర్శ

మండల కేంద్రం సంజామలకు చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ గుండం సూర్యప్రకాష్‌రెడ్డి కుటుంబాన్ని ఆదివారం రాత్రి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. సూర్యప్రకాష్‌రెడ్డి తండ్రి గుండం ఈశ్వరరెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యేతో పాటు పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి పోచా శీలారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, తదితరులు గ్రామాన్ని చేరుకుని మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

10న చనుగొండ్లలో ‘గడపగడపకు మన ప్రభుత్వం’

అవుకు: మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో ఈ నెల 10న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్ రెడ్డి ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరవుతారని అన్నారు. మండలస్థాయి అధికారులతో పాటు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొనాలని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ వెంకటరెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించి ఆర్సీ, లైసెన్స్ తదితర రికార్డులు లేని, రోడ్డు నిబంధనలు పాటించని చోదకులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించి వాహనాల రాకపోకలు కొనసాగించాలని సూచించారు.

రేపు వాహనాల వేలం

డోన్ టౌన్: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలను మంగళవారం స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆవరణలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు సీఐ శేషయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాటు సారాయి, అక్రమ మద్యం రవాణాలో పట్టుబడిన తొమ్మిద వాహనాలను ఉదయం 11 గంటలకు వేలం పాట ద్వారా విక్రయిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

పది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కోవెలకుంట్ల: 2022-23 విద్యా సంవత్సరంలో పది ఫలితాల్లో ప్రతిభ చాటిన వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లె, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తూ ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 9441137699 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కోవెలకుంట్ల: స్థానిక జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. మండలంలోని పొట్టిపాడు గ్రామానికి చెందిన ఓబులేసు సొంత పనుల నిమిత్తం బైక్‌పై బనగానపల్లె మండలం నందవరం గ్రామానికి వెళ్లి తిరిగి బయలుదేరాడు. పట్టణ శివారులోని వీఆర్.ఎస్ఆర్ ఫంక్షన్‌హాలు సమీపంలో బైక్‌పై నుంచి కింద పడటంతో ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రునికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాలకు తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

జెండా ఆవిష్కరణ

డోన్ టౌన్ : మేడే వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు ధర్మారం రంగనాయకులు పట్టణ సమీపంలోని కూరగాయల మార్కెట్ వద్ద నూతనంగా నిర్మించిన స్థూపం వద్ద ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దొరపల్లె రాజు, మాదులు, బందెనవాజ్, మల్లిక, రామనాయుడు, శివ, సూరి, శ్రీరాములు, నారాయణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

15,16 తేదీల్లో దేవర

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కమ్మవారిపల్లెలో పెద్దమ్మ దేవరకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈనెల 15,16 తేదీల్లో దేవర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కమీటీ సభ్యులు ఆదివారం తెలిపారు. దాదాపు 49 ఏళ్ల తర్వాత దేవర నిర్వహించనున్నారు. ఇప్పటికే గ్రామస్తులు ఇళ్లకు రంగులు వేయడంలో నిమగ్నం అయ్యారు. వివిధ గ్రామాల్లో ఉన్న బంధువులను ఆహ్వానించే పనిలో బిజీ అయ్యారు.

చురుగ్గా సాగుతున్న పొలాల రహదారి పనులు



రహదారి పనులు చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం. పేండేకల్లు గ్రామంలో పొలాలకు వెళ్లే రహదారి సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతుండేవారు. రైతుల విన్నపం మేరకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రూ.10 లక్షల డీఎంఎఫ్ నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం పొలాల రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. రహదారి పనులు పూర్తయితే రైతులకు సౌకర్యంగా మారనుంది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తిమ్మనాయినపేట... అభివృద్ధి బాట!



నాడు-నేడుతో పథకంతో అందంగా తయారైన ప్రాథమిక పాఠశాల

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేట గ్రామం అభివృద్ధి బాట పట్టింది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే రూ.40 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ సచివాలయం 70 శాతం పనులు పూర్తయ్యాయి. రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం పనులు పూర్తి కాగా, రూ.17.50 లక్షలతో చేపట్టిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవన పనులు కొనసాగుతున్నాయి. రూ.15 లక్షలతో వెర్రిగోవిందస్వామి ఆలయం సమీపంతోపాటు బీసీ కాలనీలో రూ.15లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. రూ.4లక్షలతో డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేశారు. రూ.28లక్షలతో రైతుల పంట పొలాలకు వెళ్లేందుకు ఫీల్డ్ రస్తాలు నిర్మించడంతో సౌకర్యంగా మారాయి. రెండు అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. రైతులకు పంట నష్టపరిహారంతో పాటు ఇళ్ల స్థలాలను ప్రభుత్వం మంజూరు చేసింది. 60 మంది సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేసుకోవడంతో బిల్లులు మంజూరు అయ్యాయి. నాడు-నేడు పథకంతో పాఠశాల సుందరంగా మారింది. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం గ్రామం చాలా అభివృద్ధి చెందిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




నిర్మాణం పూర్తైన రైతు భరోసా కేంద్రం, నిర్మాణంలో ఉన్న హెల్త్‌క్లీనిక్, నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయం